ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 • కనిష్ఠం 20.4



ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రారంభం

నిర్మల్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం సంఘ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధ్యక్షుడు వై.సాయన్న ప్రారంభించారు. అర్హులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 6 వరకు గడువు ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, గంగాధర్, నర్సయ్య, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళనకు.. వేళాయే!



• ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం



• విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

- బాసర ట్రిపుల్ ఐటీలో మార్పునకు ముందడుగు
- క్యాంపస్‌లో అక్రమార్కుల ఇష్టారాజ్యం
- అధికార సిబ్బంది మధ్య సమన్వయ లోపం
- అసౌకర్యాలతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి ఆదేశం

బాసర, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏకైక ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళనకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో క్యాంపస్‌లో మార్పులు ఉంటాయని భావిస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఇటీవలే రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్సలర్‌లతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. 'క్యాంపస్‌లో పరిస్థితి బాగాలేదు. విద్యార్థులు విశ్వాసం కోల్పోయే స్థితికి చేరింది. ప్రక్షాళన చేపట్టాల్సిందే. లేదంటే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు ఉంటాయంటూ' ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రత్యేకదృష్టితో యూనివర్సిటీల్లో పరిపాలన గాడిలో పడుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. బాసర క్యాంపస్ గత కొన్నేళ్ల నుండి విద్యార్థుల సమస్యలు, అవినీతి ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలతో వార్తల్లోకి ఎక్కుతున్న విషయం తెలిసిందే. తాజా ప్రభుత్వ ఆదేశాలతో ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు మెరుగుపరచడానికి కొత్త వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్దన్ ప్రక్షాళన చర్యలు ఆరంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

తిష్ట వేసిన అక్రమార్కులు

క్యాంపస్‌లో 9వేల మంది విద్యార్థులు ఉండగా వారి అవసరాలను తీర్చేందుకు వివిధ ప్రైవేటు సంస్థలకు బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఒక ఏడాది కాంట్రాక్టు పొంది గడువు ముగిసినా.. యూనివర్సిటీ అధికారుల ఆశీస్సులతో గత మూడేళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నారు. గత అధికారుల పొరపాటు వల్ల విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకటి , రెండు మినహా దాదాపు అన్ని కాంట్రాక్టులు మూడేళ్ల కిందటే ముగిశాయి, పలు సంస్థలపై ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అడ్డదారిలో కాంట్రాక్టు పొంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంస్థలు ఉన్నాయి. అంతేకాకుండా గత అధికారుల అండదండలు ఉండడంతో వారు చెప్పించే వేదంగా నడిచింది. ఇప్పటికీ అలాంటి అక్రమార్కుల కార్యకలాపాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఇటు విద్యార్థులు, సిబ్బంది అక్రమార్కుల ఆగడాలను ప్రశ్నించే పరిస్థితులు లేవు. ఇలాంటి వారిపై ఇప్పుడున్న వైస్ చాన్సలర్ దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విద్యార్థుల భోజనం.. మారని తీరు

ఇటీవలే కొత్తగా వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ గోవర్ధన్ ట్రిపుల్ ఐటీలో ప్రధాన సమస్యగా మారిన మెస్సులపై దృష్టి పెట్టారు. క్యాంపస్‌లో మూడు మెస్సులు ఉండగా రోజుకో మెస్సులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు. అయినా మెస్ నిర్వాహకుల్లో మాత్రం మార్పు లేదు. గడిచిన వారం పది రోజుల్లో విద్యార్థుల టిఫిన్ కర్రీలో బొద్దింక వచ్చింది. చికెన్ నాణ్యతపై విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులందరికీ కర్రీ అందడం లేదు. ఇటీవలే వారం రోజుల కిందట విద్యార్థులకు కర్రీ లేకపోవడంతో భోజనం ఆలస్యమైంది. భోజనం కూడా మెనూ ప్రకారం ఉండడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు 92 - 95 రూపాయల లెక్కన చెల్లిస్తోంది. కానీ టెండర్ సమయంలో పేర్కొన్న మెనూ అమలు జరగడం లేదు. మెనూలో ఉన్న కొన్ని ఆహార పదార్థాలు ఒక్కసారి కూడా విద్యార్థులకు అందివ్వలేదంటే పరిస్థితి ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు గుడ్డు తినని విద్యార్థులకు రెండు అరటి పండ్లు లేదంటే ఒక సంత్రా పండు లేదంటే 75 గ్రాముల గ్రేప్స్ ఇవ్వాలి. కానీ గుడ్డు తినని విద్యార్థులకు ఒకే అరటి పండు ఇస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. మిగితా రెండు పండ్లు మాత్రం ఇవ్వాల్సి ఉండగా.. ఏనాడు కూడా ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. ఇలా మెస్ నిర్వాహకులు మెనూలో ఉన్న తక్కువ ధరకు లభించే పదార్థాలపై ప్రాధాన్యత చూపిస్తున్నారే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా అన్ని ఆహార పదార్థాలు రొటేషన్ పద్ధతిలో అమలు జరిగేలా చూడాలి. అదేవిధంగా భోజనం నాణ్యంగా, రుచిగా విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


మొక్కుబడిగా 17 కమిటీల పనితీరు

యూనివర్సిటీలో పరిపాలన సౌలభ్యం కోసం అంతర్గతంగా మొత్తం 17 కమిటీలు పని చేస్తున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు ఇతర శాఖల అధికారులను ఈ కమిటీల్లో భాగస్వాములుగా ఉన్నారు. మెస్ కమిటీ, కల్చరల్ యాక్టివిటి కమిటీ, అకాడమిక్ కమిటీ, గ్రివెన్స్ కమిటీ, హౌమెన్స్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ వంటి అంతర్గత కమిటీలు మొక్కుబడిగా పని చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి దిద్దుబాటు చర్యల కోసం కమిటీలు ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ సజావుగా సమయానికి జరగకపోవడంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే తర్వాత ఆ కమిటీ విచారించి నివేదిక ఇస్తుంది. కానీ ఘటన కంటే ముందే విద్యార్థుల ఆత్మహత్యలకు, అందుకు దారి తీసిన పరిస్థితుల గురించి కమిటీలు సూచిస్తే ఒక ఘటన, సమస్య పదే పదే ఏర్పడే అవకాశం ఉండదు. అంతేకాకుండా గత అధికారుల హయాంలో గ్రూపు రాజకీయాల కారణంగా కొంతమంది పరిపాలనలో ప్రాధాన్యత లేకుండా బాధ్యతల నుంచి తప్పించారు. పనిచేసే వారిని గుర్తించి కమిటీల్లో ప్రాధాన్యత కల్పిస్తే ట్రిపుల్ ఐటీలో పరిపాలన గాడిలో పెట్టడం పెద్ద సమస్యేం కాదంటున్నారు.

మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయాలి

గడిచిన ఏడాది కాలంలో రెండు గంజాయి ఘటనలు వెలుగు చూశాయి. గంజాయి వినియోగిస్తూ విద్యార్థులు పట్టుబడ్డారు. ఈ రెండు ఘటనలతో కొంత మంది విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారనే విషయం అధికారుల విచారణలో తేలిందే. ట్రిపుల్ ఐటీలో రోజువారిగా పనిచేసే సిబ్బంది ద్వారా క్యాంపస్‌లో విద్యార్థుల వద్దకు చేరినట్లు రెండు ఘటనల్లో వెలుగుచూసింది. అలాగే వీటితో పాటు హాస్టళ్లలో మద్యం బాటిళ్లు దొరికిన సందర్భాలూ అనేకం. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలోకి మత్తు పదార్థాలు వెళ్లకుండా నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.





• ఆర్జీయూకేటీ క్యాంపస్



రాష్ట్ర యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(ఫైల్)

మూవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



సన్మాన గ్రహీతలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : నిర్మల్ జిల్లా టీవీ మూవీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురిని సన్మానించారు. యూట్యూబ్ ఛానల్ నిర్వా హకుడు రామ్ రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్ని కైన సామర్ల రాజన్న, కార్యదర్శిగా ఎన్నికైన టీ ఎన్జీవో నాయకుడు ప్రభాకర్, రాజులను మెమొంటోలు, శాలువాలతో సన్మానించారు. డాక్టర్ కృష్ణంరాజు, వేణుగోపాల కృష్ణ, హరికృష్ణ కుర్మే, డీఎల్ఎన్ చారి, డి. రాములు, కే. వెంకట్ స్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

• ముథోల్ సీఐ మల్లేష్

ముథోల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని కంటి దవాఖాన సమీపంలో ఆదివారం రాత్రి ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సాయి కిరణ్‌లు నాకాబంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధ నలు పాటిస్తూ విధిగా వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండా లన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచిం చారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక మంలో ఏఎస్సై సాహెబ్ రావు. పోలీసు సిబ్బంది ఉన్నారు.



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

యువతి ఆత్మహత్య



మృతదేహం వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెంబి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి యువతి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకా రం... మండలంలోని ఇటిక్యాల్ గ్రామా నికి చెందిన సీమల జయశ్రీ(17) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడు తుందని, దీనితో మనస్తాపం చెంది శనివారం సాయంత్రం తమ పంట పొలంలో పురుగుల మందు సేవించ డంతో, గమనించిన తల్లి సోమవ్వ వెం టనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా చికిత్స పొందుతూ ఆది వారం మృతిచెందినట్లు తెలిపారు. తండ్రి లిం గన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కుంటాల గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, నవంబర్, 3 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తజనం పోటెత్తింది. ఉదయం ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా లక్ష రూపాయల విలువ చేసే స్టీల్‌ప్లేట్లను విరాళంగా అందజేసిన బుక కవితను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

అమ్మో పెద్దపులి!

సూర్యాపూర్, మెదన్‌పూర్ అటవీప్రాంతంలో సంచారం

కుంటాల, నవంబర్, 3: (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని సూర్యాపూర్, మెదన్‌పూర్ అటవీ ప్రాంతంలో మూడురోజుల నుంచి పెద్దపులి సంచరిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన ఒక కోడె దూడను చంపగా మరో గేదెను గాయాలపాలు చేసిన పులి శనివారం సైతం అదే ప్రాంతంలో సంచరిం చినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. శుక్రవారం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా శనివారం రాత్రి కూడా పులి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. శనివారం రాత్రి 10 నుంచి 5 గంటల వరకు ఈ ప్రాంతంలో సంచరించినట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయిం దని వారు తెలిపారు. వన్యప్రాణాల సంరక్షణలో భాగంగా (పులిని ఎవరూ చంపకుండా) పులి సంచరిస్తున్న ప్రదేశంలో 15 బృందాలుగా ఏర్పడి పర్యవేక్షిస్తున్నట్లు అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలు గాని ఇతర ఏవి ఏర్పాటు చేయకుండా చర్యలు చేపడుతున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా శుక్రవారం పులి దాడిలో గాయపడ్డ గేదె మృతి చెందింది. అధికారులు పంచనామ నిర్వహించారు. మూడురోజుల నుంచి ఇదేప్రాంతంలో పులి సం చరించడంతో మృతిచెందిన జం తువుల నుంచి దుర్వాసన రావడంతో ఈ ప్రదేశానికి పులి రాకపోవచ్చునని అటవీ శాఖ అధికారులు పేర్కొంటు న్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో వేణుగో పాల్, ఎఫ్ఎస్‌వోలు కీర్తిరెడ్డి, లక్ష్మణ్, డిఆర్‌వో శంకర్, ఎఫ్‌బీవోలు లెనిన్, హరిలత ఉన్నారు.

బిర్లా గొంది అడవుల్లో పులి సంచారం

మళ్ళీ బోథ్ రేంజి అడవుల్లోకి ప్రవేశం

బోథ్ : నిన్నటి వరకు నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని అడవుల్లో అలజడి సృష్టించిన పులి ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బిర్లాగొంది గ్రామంలోకి వచ్చింది. దీంతో రైతులు గ్రామానికి చెందిన ఓ రైతుపొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా పులి కనిపించింది. వెంటనే విషయం గ్రామంలో తెలపడంతో రైతులు మూకుమ్మడిగా తమతమ చేలలోకి వెళ్లి పశువుల పాకలలో కట్టి ఉంచిన పశువులను తమతమ ఇండ్లకు తీసుకువచ్చారు. దీంతో పులి సంచారం మళ్ళీ బోథ్ రేంజీ అడవుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న అధికారులు

మహాసమ్మేళనానికి తరలిన ధర్మసమాజ్ కార్యకర్తలు

నిర్మల్‌కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఆదిభట్లలో ఆదివారం నిర్వహించిన మహాసమ్మేళనానికి నిర్మల్ జిల్లా నుంచి ధర్మసమాజ్ కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ నేతృత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రణాళికలు రూపొందిస్తారని ప్రచార కమిటీ సభ్యుడు రవీందర్ తెలిపారు. కల్లూరి సుధాకర్, భూమేష్, రాజు, శ్రీనివాస్ మహారాజ్, తదితరులు తరలివెళ్లారు.

10న పద్మశాలి సంఘం కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం ప్రియదర్శినినగర్ ఉత్తర విభాగం పద్మశాలి సంఘ అడహాక్ కార్యవర్గం ఈ నెల 10న ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలో సభ్యత్వం నమోదు, సంఘ నియమావళి తదితర కార్యక్రమాలపై చర్చిస్తామని తెలిపారు. నందన కళాశాలలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి పద్మశాలి కుల బంధువులు హాజరుకావాలని ఆయన అన్నారు. అల్లం అశోక్, జల్దా రమణ, బొద్దుల రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు మర్చిపోరు : ఎంపీ



రాథోడ్ భీంరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఉట్నూర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరిగా ఉంటుందని, పదవీ కాలంలో చేసిన సేవలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్‌లు అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఈఈగా సేవలు అందించి భీమ్‌రావు ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. ఉద్యోగ ధర్మంతో పాటు సామాజిక సేవలు చేసిన ఘనత ఆయన సొంతం అన్నారు. ప్రతి ఉద్యోగి సమాజ సేవకు కృషి చేయాల్సిన అవసరం ఉందని భీమ్‌రావును చూస్తే గుర్తుకు వస్తుందన్నారు. ఆయన చేసిన మంచిప నులు ఇలా గుర్తుకు చేసుకుంటూ అశేష జనం తరలిరావడం, ఆయనకు సన్మానాలు చేయడం మహా భాగ్యం అన్నారు. ఈ సందర్భంగా భీమ్‌రావు దంపతులను ప్రతి ఒక్కరు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు, బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్‌రాథోడ్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రంసుగుణ, మాజీ జడ్పీటీసీ చారులతరాథోడ్, సుమన్‌బాయి, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం



ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

నేరడిగొండ, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయ వసతి గృహాలకు డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు పట్ల టీటీడబ్ల్యుఆర్‌జేసీ బుగ్గరాం విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ ఎల్లేందుల స్వప్న మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా వసతి గృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జిలు పెంచడం మంచి పరిణామం అన్నారు. ఏడేండ్ల తర్వాత డైట్ చార్జీలు పెరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ గురుకులాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సెప్టెంబరు, అక్టోబర్ మాసం పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను, ఆగస్టు, సెప్టెంబరు అక్టోబర్ నెలలో పెండింగ్‌లో ఉన్న శానిటేషన్ బిల్లులను, మూడు నెలల మెయింటెనెన్స్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. విద్యుత్ చార్జీల బకాయిలు కూడా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బంజారా మండల అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్

నార్నూర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నార్నూర్ మండల నూతన అధ్యక్షుడిని సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ తాడిహత్నూర్ గ్రామ నివాసి జాదవ్ చంద్రశేఖర్‌ని ఉట్నూర్‌లోని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ స్వగృహంలో జనార్దన్‌రాథోడ్ ఇతర నాయకులు ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జనార్ధన్ రాథోడ్ మాట్లాడుతూ జాతి అభివృద్ధి జరగాలి అనుకుంటే ప్రతి ఒక్కరూ సమాజ కోసం కష్టపడాలన్నారు. ఇప్పటికీ జాతికి ప్రభుత్వపరంగా అందాల్సిన సంక్షేమ ఫలాలు అందడం లేదని, ఇంకా చాలా వరకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు చాలా మంచి నాయకులను మన సమాజం కోల్పోవడం జరిగిందిని తెలిపారు. ఇకనైనా మనమందరం ఐక్యమతంగా కలసి మెలసి హక్కుల కోసం పోరాటం చేయవల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రండి కదలిరండి సమాజం కోసం ఐక్యంకండి అని పిలుపునిచ్చారు. వారి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జిల్లా అధ్యక్షులు జాదవ్‌రెడ్డినాయక్, నారాయణ, మాజీ ఎంపీటీసీ రమేష్ రాథోడ్ తదితరులున్నారు.

చెడు వ్యసనాలను వీడితేనే సత్ఫలితాలు

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు3 (ఆంధజ్యోతి)యువత చెడు వ్యసనాలను వీడి సేవా దృక్పథం వైపు అడుగు వేసినప్పుడే సత్ఫలితాలతో పాటు ఉన్నత లక్ష్యాలకు చేరుకోగలరని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బెస్ట్‌ఫ్రెండ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పదివేల 46 మందికి రక్తదానం చేశారు. యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా సేవా పురస్కార్ నేషన్ అవార్డు అందుకున్న సొసైటీ అధ్యక్షులు, సభ్యులను మాజీ మంత్రి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతు చెడు వ్యసనాలకు బానిసవుతు యువత నిర్దేశించుకున్న లక్ష్యాలకు దూరమవుతుండడం బాధకరమన్నారు. యువత వారి లక్ష్యాలను దిశా నిర్దేశం కల్పించుకుని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరన్నారు. ఇందులో రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, సాజిదుద్దీన్, సేవ్వజగదీశ్, అప్కామ్‌గంగయ్య, పర్రు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్ మున్నూరు కాపు సంఘం ఎన్నిక

బోథ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బోథ్ పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మల్లెపూల శివారెడ్డి ప్రధాన కార్యదర్శిగా బోనగిరి కార్తీక్ కోశాధికారిగా భారీ గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా మల్లెపూల మహేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా కట్ట భూమేష్, సోమ శంకర్, కుమ్మరి పోతారెడ్డి, కుమ్మరి చంద్రశేఖర్, కైపెల్లి రవి భార్య భోజన్న, అల్లకొండ పోతన్న, మల్లెపూల సత్యనారాయణ, అలంక రాజేష్, ఆడప రాజేశ్వర్‌లతో పాటు సలహాదారులుగా రావుల శంకర్, ఆర్‌టీవీ ప్రసాద్‌రావుల గణపతులను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

పండుగలు ముగిసినా...

పంపిణీ కాని చీరలు



మండల కేంద్రంలో నిల్వఉంచిన చీరలు

- అధికారుల తీరుపై మహిళా సంఘాల మండిపాటు...
- పంపిణీ చేయాలని డిమాండ్
- గోదాముల్లో ఎలుకల భయం



రంధ్రం చేసిన ఎలుకలు

తలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం బతుకమ్మ, దసరా పండు గకు మహిళలకు కానుకగా ప్రభుత్వం బతు కమ్మ చీరలను పంపిణీ చేశారు. కాని ఈ సం వత్సరం బతుకమ్మ పండుగ దసరా పండుగ దీపావళి పండుగలు ముగిసినప్పటికీ ఇప్పటి వరకు మహిళలకు బతుకమ్మ చీరలు పం పిణీ చేయకపోవడం పట్ల అధికారుల తీరు పట్ల మహిళా సంఘాలు మండిపడు తున్నా యి. దీపావళి పండుగ ముందు మండలానికి 11800 చీరలు వచ్చినప్పటికీ వాటిని పంపిణీ చేయడంలో అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం మండల కేంద్రంలోని వసుంధర మండల సమాఖ్య కార్యాలయంలోనే మిగిలి పోయాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒకటి చొప్పున 18 సంత్సరాలు నిండిన ఆదివాసి మహిళలకు రెండు చీరలు పంపిణీ చేయాలని అనుకున్నారు. కాగా కార్యాలయంలో బతుకమ్మ చీరలకు నిల్వ ఉంచిన ప్రదేశంలోనే చీరలు ఎలుకల పాలు కావడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ప్రభుత్వం మహిళలకు సరఫరా చేసిన బతుకమ్మ చీరలను త్వరగా పంపిణీ చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

● త్వరలో పంపిణీ చేయాలి

మహిళల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలు అధికారులు త్వరగా పంపిణీ చేయాలి. ఇప్పటికే లేట్ అయింది. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు ముగిసిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే మహిళలకు చీరలు పంపిణీ కాలేదు.

● కాటిపల్లి సునీతారెడ్డి

● ప్రభుత్వ ఆదేశాలు రాగానే చీరల పంపిణీ

మహిళలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను గత 20 రోజుల క్రితం సరఫరా చేసినప్పటికీ మహిళా సంఘాలకు పంపిణీ చేసేందుకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మహిళా సంఘాలకు, ఆదివాసి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తాం.

● చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం

రోడ్లపైనే వ్యాపారం

● రాకపోకలకు ఇబ్బందులు



మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపైననిలిపిన వాహనాలు

బోథ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రధా న రహదారి రోజురోజుకు రద్దీగా మారుతుంది. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని రోడ్డుపైకి తీసుకు వస్తు న్నారు. దీంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో వైపు కిరాణా దుకాణాలకు సామగ్రి తీసుకొని వచ్చే వాహ నాలు స్థలం లేక రోడ్లపైనే నిలపాల్సి వస్తుంది. దీంతో రోడ్డు రద్దీగా మారింది. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సంస్థల వారు మురికి కాలువను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు 50 ఫీట్ల వెడల్పుతో ఉన్న రోడ్డు ప్రస్తుతం 30 ఫీట్లకు చేరుకుంది. అందులో 10 ఫీట్ల వరకు రోడ్లపైనే వాహనాలు ఉంటున్నాయి. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పోలీసులు ఆక్రమణల విషయంలో రోడ్డును ఖాళీ చేయించారు. దీంతో ప్రజల అవసరాలకు రోడ్డు ఉపయోగంలోకి వచ్చింది. రోజు రోజుకు పెరుగుతున్న పట్టణ జనాభాకు తోడుగా వివిధ గ్రామాల నుంచి పనులపై ప్రతిరోజు వేల సంఖ్యలో జనం వస్తూ పోతు ంటారు. అయితే రోడ్డుపైన జనం రద్దీ పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగా రోడ్డు సరిపోవడం లేదు. అధికారులు ఆక్రమణాలను తొలగించినట్లయితే ప్రజలకు ఇబ్బందులకు తొలగిపోతాయి. నియోజకవర్గ కేంద్రంలో ప్రధాన రహదారి ఆక్రమణల విషయమై పోలీసు అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు చొర వ చూపించాలి. లేకుంటే ప్రధాన రోడ్డుపై ఆక్రమణల జోరు మరింతగా పెరిగే ఆస్కారం ఉంది.

ఉపాధ్యాయునికి న్యాయం చేయాలని నిరసన

తాంసి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 15 రోజుల పాటు విధులకు వెళ్లిన తరువాత ఉపాధ్యాయుడిని తొలగించడం ఎంత వరకు న్యాయమని యువకులు ప్రశ్నించారు. ఆదివారం తాంసి మండల కేంద్రంలో పలువురు యువకులు నిరసన వ్యక్తంచేశారు. మంగళవారం నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి స్పందించి అభ్యర్థికి న్యాయం చేయాలని కోరారు.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు



దొర్లి నుంచి పల్సీ (కే)కు వాగు దాటుకుంటూ వెళుతున్న రైతులు (ఫైల్)



ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

తలమడుగు, నవంబరు 03 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించక పోవడంతో లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో సుంకిడి నుంచి తలమడుగు మండల కేంద్రానికి రావాలంటే మూడు లోలెవల్ వంతెనలు ఉండటంతో ప్రయాణీకులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏ చిన్న వర్షం కురిసిన లోలెవల్ వంతెనపై నుంచి పొంగిపొర్లడంతో రాక పోకలకు ఇబ్బంది తప్పడం లేదు. హై లెవల్ వంతెన నిర్మాణం కోసం అధికారులు నాయకులు హామీలు ఇస్తున్నారు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● హామీలకే పరిమితమైన హైలెవల్ వంతెనల నిర్మాణం

గత వర్షాలు కురిసిన భారీ వర్షాలకు లోలెవల్ వంతెనలు పొంగిపొర్లిపోవడంతో గంటల తరబడి వాగువద్ద నిరీక్షణ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న పెద్దవాగు వద్ద ప్రతి సంవత్సరం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా ఇటీవల జిల్లాలోని ఆయా గ్రామాలకు వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ తలమడుగు మండలానికి వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాకకపోవడంతో మండలవాసులు అసంతృప్తిగా ఉన్నారు. కొన్నిగ్రామాల వద్ద వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రైతులు, కూలీలు వాగులు దాటుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి ఉంది. నిధులు మంజూరు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల జాడేది?

(5వ పేజీ తరువాయి...)

పైన ఆశలు పెంచుకున్నారు. 2021లో అప్పటి ప్రభుత్వం 57ఏళ్ల వరకు కూడా ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఎంతో ఆశతో ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గత ఐదేళ్లలో భర్తలు చనిపోయిన వితంతువులకు, వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు కొత్తగా మంజూరు కావడం లేదు. ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట, దంతనపల్లి, బీర్సాయిపేట, నర్సాపూర్‌బి, పులి మడుగు, సాకేరా, ఉట్నూర్, నాగపూర్, షాంపూర్, ఎందా, ఎంకా, వాదోని, చందూరి, హస్నాపూర్ లాంటి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆసరా పింఛన్లు, వితంతువుల పింఛన్లు, దివ్యాంగుల పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇది కాకుండా బీడీ కార్మికులు సైతం పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇవ్వడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అందుబాటులో విత్తనాలు



జామిడిలో సిద్ధంగా ఉన్న విత్తనాలను పరిశీలిస్తున్న చైర్మన్

● తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

తాంసి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ విత్తన శుద్దిని పునః ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ విత్తన శుద్ధి రాష్ట్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జామిడి గ్రామంలో విత్తనశుద్ధి కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. రైతులతో సమావేశమై విత్తనోత్పత్తి, పంపిణీ, వ్యవసాయ విధానాలపై చర్చించారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడంలో టీఎస్ఎస్‌డీసీఎల్ మద్దతు ఉంటుందని చైర్మన్ రైతులకు హామీనిచ్చారు. మంచి పంట దిగుబడి, వ్యవ సాయ లాభదాయకత కోసం నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 10 క్వింటాళ్ళ సోయాబీన్‌లను కొనుగోలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం అమలు కావడం లేదని రైతులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో చైర్మన్ ఫోన్ చేసి ఆరా తీశారు. సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

● విత్తనాల గోదాం తనిఖీ....

జామిడి గ్రామంలో రబీ సీజన్ కాలంలో విత్తడానికి సిద్దంగా ఉన్న విత్తనాలను చైర్మన్ అన్వేష్‌రెడ్డి పరిశీలించారు. ఇందులో ఏవి నాణ్యమైన విత్తనాలో సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో నాణ్యత లోపం జరిగితే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు సమిష్టి కృషితో ముందుకు వెళ్లడం అభినందనీయమని అభినందించారు. ఆయన వెంట కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కేశవ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ కన్వీనర్ సంతోష్, రూపేష్‌రెడ్డి ఉన్నారు.



బోథ్‌లో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్ : తెలంగాణ రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన విత్తనాలు అన్ని సెంటర్లలో అందుబాటులో ఉంచడం జరిగిందని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆగ్రో సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లు రబీ సీజన్‌లో విత్తనాలకు గాను నాణ్యమైన శనగ విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీ వలలో పడి మోసపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ సీడ్స్ విత్తనాల అమ్మకం గురించి ఆరా తీశారు. తెలంగాణ విత్తనాలు అభివృద్ధి సంస్థకు విత్తనాల కోసం సాధారణ అమ్మకాలకు సంబంధించి మధ్య దళారీలను నమ్మకుండా ప్రత్యక్షంగా రైతులతోనే ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులను గ్రామాలకు పంపించి విత్తనాభివృద్ధిపై మరింత అవగాహన కల్పిస్తామన్నారు.

నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి

బజార్‌హత్నూర్ : రైతులకు అందించే విత్తనాలను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులకు అందించాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ చైర్మన్ అవినాశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పలు ఫర్టిలైజర్స్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పండించే రైతులకు అవగాహన కల్పిస్తూ షాపు యజమానులు విత్తనాల కొనుగోలులో రైతులకు జాగ్రత్తలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లెపూల నరసయ్య, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, సొసైటీ డైరెక్టర్ చట్ల విలిల్, సీనియర్ నాయకులు శివుడు, విఠల్, సొసైటీ సీఈఓ నారాయణ, ఆగ్రో సంస్థ యజమాని బత్తిని సుధాకర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత దళితులను ఆదుకోండి

● ప్రభుత్వానికి దళిత జేఏసీ డిమాండ్

నార్నూర్, నవంబర్3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌ని 20 శాతం వరకు పెంచాలి అని దళిత జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌మానే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో దళితుల పట్ల చాలా వరకుఅన్యాయం జరిగిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అన్నారు. ఇప్పుడు ఉన్న సమయంలో జనాభా దామాషా ప్రకారం 20శాతానికి రిజర్వేషన్ పెంచాలి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అధికారంలో రాక ముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి చేయాలి. గత ప్రభుత్వం దళిత బందు పథకాన్ని ప్రవేశ పెట్టారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఆపేశారు. దీని వలన చాలా మందికి లబ్ది పొందలేక పోయారు. ముఖ్యంగా రాష్ట్రంలో వెనుకబడిన అడవుల జిల్లాగా పేరు ఉన్న ఆదిలాబాద్ ప్రాంత దళితుల చాలా వరకు అభివృద్ధికి దూరం ఉన్నారు. అధికార ప్రభుత్వానికి ఏజెన్సీ ప్రాంత దళిత ఆదివాసుల అభివృద్ది జరగాలంటే ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకోవాలి. దళితబందు కింద రూ.5వేల యూనిట్లు అందజేయాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులతో స్థానిక ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సంఘం భవనం, పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందే విధంగా చూడాలని సంఘం సభ్యులు ఆయనను కోరారు. ఈ విషయాలపై అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నాయీబ్రాహ్మణులకు వృత్తిశిక్షణ, హాస్టల్ కోసం 2 ఎకరాల స్థలం, యువజన సంఘ భవనం కోసం నిధులు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ ఫలాలు కేటాయించాలని కోరారు. అనంతరం నూతన పట్టణ కమిటీ, జిల్లా కమిటీ నాయకులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యెల్మెల్‌వార్ అర్చనరామ్‌కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు అంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు డ్యాగం వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు సోమగారి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బొడిగం శ్రీకాంత్, కోశాధికారి సేర్లవార్ రాజు, గౌరవ అధ్యక్షులు షేర్లవార్ రవీందర్, ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షులు కుర్మెల్కార్ తుకారామ్, ఆదిమూలం సుదర్శన్‌రావు తదితరులున్నారు.



కంది శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పవిత్ర కార్తీకం.. ఆధ్యాత్మిక సంరంభం!

» ప్రారంభమైన కార్తీక మాసం » శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం » ఉసిరి చెట్టు నీడన సామూహిక భోజనాలు

కార్తీకమాసంలో సమానమైన మాసం లేదు. విష్ణు దేవుడితో సమానమైన దేవుడు లేడు. గంగతో సమానమగు తీర్థం లేదని పెద్ద చెబుతుంటారు. తెల్లవారు జాము నిద్రలేవడం.. ప్రవహిస్తున్న నీళ్లలో స్నానం చేయడం.. భోలాశంకరుడికి నిత్యం రుద్రాభిషేకం చేయడం, నుదుట విభూతిని, మెడలో రుద్రాక్షాల్ని, తులసి పూసల్ని ధరించడం.. ఒక పూట మాత్రమే భుజించడం.. ఉసిరి చెట్టు నీడలో వనభోజనాలు చేయడం ఇలా ఒకటేమిటి ఎన్నెన్నో సాంప్రదాయాలు మూటగట్టుకొని తెచ్చింది పవిత్రమైన కార్తీక మాసం. ఈ కార్తీక మాసంలో చేసే వ్రతములలో ముఖ్యమైనవి కార్తీక స్నానం, ఉపవాసం, కార్తీకదీపము.

● ముథోల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)

● కార్తీక స్నానం

కార్తీక మాసం అంతా తెల్లవారు జాము లేచి కృతిక నక్షత్రం అస్తమించే లోగానే నదిలో గాని, తటాకీల్లో గాని అలాంటివి అందుబాటులో లేనివారు ఇంట్లోనే స్నానాల గదిలో అయినా సరే తల స్నానం చేయాలి. సియమంలో శివుడిని గాని విష్ణువుని గాని ధ్యానించడం పూజించడం చేయాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నమ్మకం. కార్తీక మాసంలో పగలంతా ఉపవాసం ఉండి రాత్రి భోజనం చేయాలనేది ఒక నియమం. దీన్నే నక్తమ్ అంటారు. పగలంతా నిరాహారంగా ఉండలేని వారు పాల వంటి ద్రవపదార్థాలు లేదా ఫలాలు స్వీకరిస్తూ రాత్రి వేళలో చంద్ర దర్శనం చేసుకొని దీపారాధన చేసుకొని భోజనం చేయాలి.

● నిత్యం దీపారాధనలు

కార్తీక మాసంలో దీపారాధన చేయడం మహా ఫైమానిత్య ఫైనవి శివాలయంలో గాని ఇంట్లోనైనా సరే పాతః కాలం సాయంకాలం దీపారాధన చేయడం దైవానుగ్రహం లభ్య అయ్యే విధానం. ఎవరైనా సరే తెలిసిగాని తెలియకగాని ఎక్కడైనా సరే కార్తీక మాసంలో దీపం పెడితే చాలు మరి సర్వవిధ పాపాలు హరింపజేస్తుందని ప్రగాఢ నమ్మకం. జ్ఞానం, మోక్షం, శ్రేయస్సు, శుభ ఫలితాలు కలుగుతాయని ఆశిస్తారు. కార్తీక దీపం దీపదానం వల్ల నరకప్రాప్తి నివారణ కలుగుతుందని భావిస్తారు. ఈ మాసంలో దీపారాధన స్త్రీలకు విశేష ఫల ప్రధమము. దీపం దానమిచ్చుట. బంగారము, నవధాన్యములు అన్నదానం వల్ల స్త్రీలకు మంగళప్రదాయం, సౌభాగ్యకరముగా ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. సూర్యాస్తమయం అయిన వెంటను సంధ్యా దీపం వెలిగించి ముగ్గు పెట్టి ఇంటి ముందు దీపం పెట్టి తులసి కోటలో దీపం పెట్టుట, తులసి పూజ, గౌరీ పూజ, నోముల వలన ఆర్థిక బాధలు తొలగుతాయని నమ్ముతారు. కార్తీక మాసంలో కొన్ని వస్తువులను నిషేధిసారు. ఇంగువ, పెద్దఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, దుంప, గుమ్మడికాయ, తేమ గుమ్మడి, నువ్వులను నిషేధిస్తారు. ఈ మాసంలో పగటి పూట ఆవు పేడతో అలికి పద్మములతో ముగ్గులు పెట్టి రంగురగుల రంగవల్లిపై కార్తీక దీపం పెట్టి కార్తీక పురాణం చదివిన వారికి, విన్న వారికి ఏడు జన్మల వరకు వైదవ్యం కలగదని కార్తీక పురాణం చెబుతుంది.

● దీపం పరబ్రహ్మాం

కార్తీక మాసంలో ముఖ్యంగా చెప్పుకోవలసినది దీపారాధన. ప్రతీ రోజు రెండు పూటలా దీపాన్ని వెలిగించి భక్తితో భగవంతుడిని ప్రార్థిస్తారు. దీపాన్ని ఎలా వెలిగించాలి అనే దానిలోను నియమాలు ఉన్నాయి. ఇష్టం వచ్చినట్టు దీపారాధన చేయకూడదు. దానికి పురాణాల్లో ఒక విధానాన్ని నిర్దేశించారు. తెల్వారు జామునే స్నానాదులు ము గించి (వీలైతే నది స్నానం శ్రేష్ఠం) సూర్యోదయం కంటే ముందే తులసి కోట ముందు దీపారాధన చేయాలి. ఇలా ఉదయాన్నే ఉంచిన దీపం విష్ణువుకు చెందుతుందని చెబుతారు. అదే విధంగా సాయంత్రం సంధ్యా సమయంలో దీపాన్ని వెలిగించాలి. ఈ దీపం తులసి మాతకు చెందుతుందని అంటారు. అసలు దీపారాధన చేసేది విష్ణు కోసమే. ప్రతి నెలలోను విష్ణువుకు ఒక పేరు ఉంటుంది. కార్తీక మాసంలో దామోదరుడుగా పిలుస్తారు. విష్ణువు ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు యోగనిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశినాడు నిద్రలేస్తాడని అంటారు. అందుకే కార్తీక మాసంలో వచ్చే ఏకాదశి ప్రత్యేకమైనదిగా చెబుతారు. ఇక దీపాల విషయానికి వస్తే కార్తీక మాసంలో చేసే దీపారాధన వల్ల గతజన్మలో చేసిన పాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు 365 వత్తులతో దీపాన్ని వెలిగిస్తారు. ఇది సంవత్సరం మొత్తం విష్ణుమూర్తికి దీపారాధన చేసిన ఫలితాన్నిస్తుందని పండితులు చెబుతున్నారు. దీపం పరబ్రహ్మ స్వరూపంగా చెబుతారు. చీకట్లు పారద్రోలే దీపం... భక్తుల కష్టాలను పారద్రోలుతుందని నమ్ముతారు. ఇక ఆలయాల్లో సాయం సంధ్యా సమయంలో ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. దీపాన్ని స్తంభంపై ఎత్తుగా ఉంచుతారు.

ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత ఉన్న ఆకాశ దీపం.. శాస్త్రీయంగానూ చాలా ఉపయోగకరం. కార్తీక మాసం వర్షాకాలం వెళ్లిపో యాక వస్తుంది. వర్షాలతో ప్రకృతి అంతా నీటిలో నానిపోతుంది. అయితే ఇదే సమయంలో వివిధ రకాల కీటకాలు వృద్ధి చెందుతాయి. వాటిని దీపా లు ఆకర్షిస్తాయి. ఆ దీప కాంతి వేడికి అవి అక్కడే ఆగిపోతాయి. అందుకే దీపాల్ని వెలిగించడం ఉపయోగకరం. ఆకాశ దీపం కూడా అదే విధానం... దైవం చెడు నుంచి రక్షించేది అనేదిగా భావిస్తాం. దీపం కూడా ఆ పని చేస్తుంది. పూర్వ ఆలయాలు దాదాపుగా ఊరికి అటు చివర ఇటు చివర ఉం డేవి. చిన్నచిన్న ఊళ్లు ఉండేవి. అక్కడి ఆలయాల్లో ఎత్తుగా వెలిగించి ఉంచే దీపం ఊరంతా కాంతిని పంచడమే కాకుండా కీటకాలను అక్కడే ఆకర్షించి ఊళ్లలోకి వెళ్లకుండా చేస్తాయి.

● ధాత్రి పూజ

ధాత్రి అంటే ఉసిరిక. ఉసిరిక లక్ష్మీదేవికి ఆవాసమై ఎంతో ఇష్టమైనది. కార్తీక మాసంలో ఈ ఉసిరి వృక్షం కింద భోజనం చేయడం ఎంతో అదృష్టమైందని పలువురు నమ్ముతారు. ఉసిరి వృక్షం మొదట్లో ధాత్రి దేవిని దామోదర స్వామిని పూజించి మధుల పదార్థాలను నిషేధించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరిచెట్టు ఉన్న వనంలో భోజనాలు చేయడం వన భోజనానికి ప్రసిద్ధి.

● కార్తీక మాసంలో అన్నదానం విశిష్టత

కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా చెప్పబడుతోంది. ఈ మాసంలో నది స్నానం, దీపారాధన జల పాతాలు విశేషమైన ఫలితాలను ఇస్తాయి. దాన ధర్మాల వల్ల పుణ్యము అంతకంతకూ పెరుగుతూ పోతుంది. అందువలన ఈ మాసంలో ఎవరికి తోచినంతలో వాళ్లు దాన ధర్మాలు చేస్తుంటారు. దానం అనేది అనేక రకా లుగా ఉంటుంది. చేసిన దానాన్ని బట్టి ఫలితం ఉంటుంది. సాధారణంగా దానాల్లో అన్నదానానికి మించినది లేదంటారు. సమస్త దోషములను నశింపజేసి సకల శుభకార్యాలలో దైవ కార్యాలలోనూ అన్నదానానికి ప్రాధాన్యతను ఇస్తుంటారు. కార్తీక మాసంలో అన్నదానం వలన లభించే ఫలితం రెట్టింపు ఉంటుందని నమ్మకం.



బాసరలో కొనసాగుతున్న కార్తిక ప్రత్యేక పూజలు



అంతర్రాష్ట రహదారిపైకి వచ్చిన ముళ్ల పొదలు

అధికారులూ ముళ్లపొదలు తొలగించరూ..!

బోథ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కన బస్సుల్లోని ప్రయాణీకులకు తగిలి గాయాలవుతున్నాయి. మరోవైపు ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కనకు వెళ్లాలంటే జంకుతున్నారు. రోడ్లపక్కన పెరిగిన ముళ్లపొదలను తొలగించాల్సిన కాంట్రాక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రయాణీకులకు శాపంగా మారింది. అధికారులు నిర్మల్, ఆదిలాబాద్ వెళ్లే బోథ్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బోథ్ కిన్వాట్ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. రోడ్డుపక్కన ఉండి అడవి పందులు ఆకస్మికంగా రోడ్లపై వస్తున్నాయని దీంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.



అగ్ని గుండాలు దాటుతున్న భక్తులు

ఘనంగా చిలుకలయ్య, కోరుగుట్టయ్య జాతర

పెంబి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లి గ్రామంలో చిలుకలయ్య, కోరుగుట్టయ్య జాతర, కళ్యాణ మహోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు అగ్నిగుండాల్లో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు కేశఖండన, తులాభారాలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ జాతరకు పెంబి మండలంతోపాటు ఇతర మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల్‌లోని ఓ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో జాతరకు వచ్చి భక్తులకు పులిహోర ప్యాకుట్లు, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో పూజారులు అర్జన్న, విష్ణు, భోజన్న, ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



జాతరకు హాజరైన భక్తులు

నేటి నుంచి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవ వేడుకలు

● సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం ● అవసరమైన ఏర్పాట్లు చేపట్టిన ఆలయ నిర్వహణ కమిటీ

భైంసా, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం ఏడో వార్షికోత్సవ వేడుకలకు సర్వంగా సుందరంగా ముస్తాబైంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రణాళికా బద్ధమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు అధిక సంఖ్యలో వేడుకలకు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలన్నింటిని శోభయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో,పూలతో అలంకరించారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆలయంలో మూడు రోజుల పాటు శ్రీ లక్ష్మీ గణపతి శ్రీ రుద్ర సహిత చండీ సప్తశతి యాగ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్, యాగ బ్రహ్మ బాలాజీ శర్మ (బాసర), వేద పండితులు వెంకటేశ్వర శర్మ (తిరుపతి) చేతుల మీదుగా వార్షికోత్సవ, యాగ మహోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి. సోమవారం ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, యాగశాల ప్రవేశం, చండీ హోమం నిర్వహణతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 6.30 గంటల నుంచి అభిషేకములు, రుద్రహోమం వేద పారాయణం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, చండీ హోమం, సాయంత్రం 6 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం, బుధవారం దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా ఉదయం 8 గంటలకు అయ్యప్ప ఆలయ శుద్ధి, పంచామృతాభిషేకం, చండీ రుద్రహోమం, మహా పూర్ణహుతి, దేవాలయ శిఖర కుంబాభిషేకం, మహాసంప్రోక్షణ అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఇబ్బంది పడకుండా చర్యలు చేపడుతున్నారు.



వేడుకలకు ముస్తాబైన అయ్యప్ప దేవాలయం

శుద్ధజలం.. ప్రశ్నార్థకం!

ప్రతినిత్యం ప్రజలకు శుద్ధజలం సరఫరా చేసే ట్యాంకులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు ట్యాంకుల వద్ద దుర్గంధం రాజ్య మేలుతోంది. ట్యాంకుల కింద బురదమయంగా మారి దుర్వాసన వస్తుండడం, చుట్టుపక్కల కనీస పరిశుభ్రత కరువవడంతో ప్రజలకు శుద్ధజలం సరఫరా ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎటువంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోక ముందే వాటర్ ట్యాంక్‌లను అధికార యంత్రాంగం పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ముళ్ల పొదల్లో ఉన్న వాటర్ ట్యాంక్



భగత్ సింగ్‌నగర్ కాలనీలో చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్

ఫొటో న్యూస్



వడ్డెర కాలనీలో దుర్గంధ వాతావరణంలో ఉన్న వాటర్ ట్యాంక్



పిచ్చిమొక్కల మధ్యనే ఉన్న వాటర్ ట్యాంక్



మహాలక్ష్మి వాడలో వాటర్ ట్యాంకులోకి వెళ్లే నీటి సరఫరా వద్ద మురికి కాల్వలతో దర్శనమిస్తున్న దృశ్యం



ప్రహరీ లేక ప్రమాదకరంగా తిర్పెల్లిలోని వాటర్ ట్యాంక్

ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 18.2

ఆదిలాబాద్ జిల్లా వార్తలు


5

సోమవారం 4 నవంబరు 2024



సీఐటీయూ జిల్లా స్థాయి సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 28న సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయం, భాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంతేకాకుండా కార్మికుల సౌలభ్యం కోసం ఈ భవనం నిర్మించినట్లు కూరపాటి రమేష్ పేర్కొన్నారు.



కొత్త రేషన్ కార్డుల.. జాడేది?

- జిల్లాలో అందని ద్రాక్షగా.. సంక్షేమ పథకాలు
- ప్రశ్నార్థకంగా మారిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ
- కొత్త వారికి సైతం అందని పింఛన్లు
- పేదల కష్టాలను పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై సామాన్యుల ఆశలు

ఉట్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు దాటినా.. కొత్త పథకాలకు శ్రీకారం చుట్టలేదు. ఫలితంగా ప్రభుత్వాలు ప్రారంభిస్తున్న సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగా మారుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వం కొన్ని మాత్రమే అమల్లోకి తెచ్చి.. అసలైన పథకాలను పేదలకు అందించడం లేదని విమర్శలు వస్తున్నాయి. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామంటూ.. రాష్ట్ర ప్రభుత్వం చింత ఆకులో భోజనం వడ్డించి విందు ఇస్తున్నట్లుగా పథకాలు కనబడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొట్లాడి తెచ్చుకున్న కొత్త రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం పేదల కష్టాలు పట్టించుకోలేదని, అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం కూడా పది మాసాలు అవుతున్నా.. పేదలకు కావాల్సిన పథకాలను ఇవ్వడం లేదని అంటున్నారు. ఉన్నోడు ఉన్నోడుగా, లేనోడు లేనోడుగానే మగ్గిపోతున్నారని పరిశీలకులు అంటున్నారు. కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ఉన్న సంక్షేమ పథకాలు పోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని పేదలు, సామాన్యులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.


కొత్త రేషన్ కార్డుల జారీలో విఫలం!!

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తి కావొస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంలో విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ద్వారా పేద ప్రజల వద్ద ఉన్న కార్డులు చాలా మందికి రద్దు చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం అంతంత మాత్రమే కొందరికి రేషన్ కార్డులు జారీ చేసింది. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న కొందరు ఆపరేటర్ల వల్ల రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు గల్లంతు అయ్యాయి. ప్రభుత్వం మరోసారి అవకాశం ఇవ్వకుండా పేర్లు చేర్చకుండా ఉండిపోగా వేలాది కుటుంబాలలో చాలా మందికి కొత్తగా వివాహాలు జరిగాయి. వారికి కూడా రేషన్ కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా చాలా మంది కొత్త రేషన్ కార్డులు కోసం ఎదురు చూస్తు వస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలన్న రేషన్‌కార్డు అవసరం ఎంతో ఉంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న తెల్లరేషన్ కార్డులను జారీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతుం డడంతో ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. కొత్త ప్రభుత్వమైన రేషన్‌కార్డులు ఇస్తుందా? అంటే అది కూడా రేపు, మాపు అంటూ కాలక్షేపం చేస్తోందని, పేర్లు గల్లంతయిన వారి పేర్లు తిరిగి చేర్చడంలో కూడా కొత్త ప్రభుత్వం చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

అందని కొత్త పింఛన్లు

ప్రజా ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీల పథకం అమలవుతున్నా.. కొత్త పింఛన్లు మంజూరు చేపట్టలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన ఆసరా, వికలాంగుల పింఛన్లు పేద లబ్ధిదారులకు అందక పోవడంతో ప్రజా ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో...)





కార్డు కోసం దరఖాస్తు పెట్టి ఐదేళ్లు అవుతోంది

: రమ్య, గృహిణి, నాగాపూర్

తెల్ల రేషన్‌కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు పెట్టి ఐదేళ్ల కావొస్తోంది. తెల్ల రేషన్‌కార్డు లేకపోవడం వల్ల నిత్యావసర సరుకులు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసుకుని నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డులు ఇచ్చి ఆదుకోవాలి.

పింఛన్లు ఎక్కడ?

: ఎం.నర్సయ్య, స్థానికుడు, నాగపూర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామంటే దరఖాస్తు చేసుకుని ఐదేళ్ల పూర్తి అయ్యింది. రోజులు గడుస్తున్నాయి కానీ.. కొత్త ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్లు మంజూరు చేయక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఆసరా పింఛన్లు త్వరగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు

: మొహమ్మద్ వాజీద్‌ఆలీ, జిల్లా పౌరసరఫరాల అధికారి, ఆదిలాబాద్

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. చాలా మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అందిస్తాం.



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కలిసిన తుడుందెబ్బ నాయకులు

కొమురంభీం నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ఉట్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని కొమురం భీంనగర్ కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హామీ ఇచ్చారని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ తెలిపారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెడ్మబొజ్జు పటేల్‌ని కలవడం జరిగిందని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ తెలిపారు. ఆయన వెంట ఆదిలాబాద్ జిల్లా తుడుందెబ్బ నాయకులు కలిసి వారికి శాలువాతో సన్మానం చేయడం జరిగిందన్నారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యేకి ఆదిలాబాద్ పట్టణం మావల మండలం కొమురంభీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల, కరెంటు, మంచి నీరు, రోడ్డు, విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. అదే విధంగా ఆదివాసులకు జరుగుతున్నటువంటి సమస్యల గురించి వారితో చర్చించడం జరిగిందన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కూడా సానుకూలంగా స్పందిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని కొమురంభీంకాలనీ సమస్యలు వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యే విధంగా తన వంతుగా కృషి చేస్తానని, అదే విధంగా ఆదివాసీల గురించి ఎలాంటి సమస్య వచ్చినా ముందు నాదృష్టికి తీసుకురమ్మని, సమస్యలు పరిష్కరించే విధంగా మనమందరం కృషి చేద్దామని తెలిపారని అన్నారు. ఎమ్మెల్యే స్పందించి తుడందెబ్బ నాయకులకు తాను ఎప్పుడు కూడా మీతోనే ఉంటా అని మాట ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టిమనోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోయం రాందాస్, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, సోయం లలిత, ఆత్రం గణపతి, వెడమ ముకుందరావు, తొడసం ప్రకాష్‌లున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

- ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో హిందుస్థాన్ ఆగ్రో సైన్స్ వారి నూతన వెరైటీ భజరంగ్ బీజీ-2 విత్తన కేంద్రాన్ని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రైతులకు సూచనలు, సలహాలు చేశారు. రైతులు వాతావరణ పరిస్థితులను బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రం అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. విత్తన కంపెనీలు రైతులకు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న, సంతోష్, రఘుపతి, రాందాస్, సుభాష్, రైతులు పాల్గొన్నారు.



విత్తన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గొడం నగేష్

సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్ కార్యక్రమం



ఫోన్‌ఇన్‌లో సమస్యలు నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఖానాపూర్ నియోజక వర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజక వర్గంలోని వివిధ మండలాల నుంచి భూ సమస్య లు, ఇందిరమ్మ ఇళ్ల, రోడ్లు, నీటి, మురికి కాలువలు, ఫారెస్టు, పెన్షన్ సమస్యల ఫోన్ కాల్స్ వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. నియోజక వర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడం కోసం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని బొజ్జుపటేల్ పేర్కొన్నారు.

ఉషు క్రీడల్లో మండలవాసికి గోల్డ్ మెడల్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన చాక్కలి లింగన్న, నవీన దంపతుల కుమారుడు సిహెచ్ విప్లవ్ ఉషు అండర్-19 రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించారు. మూడు రోజుల పాటు మహబూబాద్ జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విప్లవ్ పాల్గొననున్నట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు, బంధువులు, తోటి క్రీడాకారులు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన సీహెచ్ విప్లవ్





తిరుమల తిరుపతి దేవస్థానంలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే అనిల్

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే అనిల్

బోథ్/నేరడిగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదివారం తిరుపతి వెంకన్నను దర్శించుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఆయన వేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తానని మొక్కుకోవడంతో మొక్కులు చెల్లించుకు నేందుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ప్రజలపైన స్వామివారి ఆశీస్సులు ఉండాలని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరకోవడం జరిగిందన్నారు.



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ డా.మృణాళిని

కథల పోటీల్లో లక్ష్మీపూర్ విద్యార్థిని ప్రతిభ

జైనథ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన బడి పిల్లల కథల పోటీ-2024లో జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తల్లెల కీర్తి ప్రతిభ కనబరిచింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లెల కీర్తిని తెలుగు విశ్వ విద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డా.మృణాళిని సన్మానించారని ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ తెలిపారు. కీర్తి రాసిన తెలుగులోనే కథకు బహుమతి రావడం జరిగింది. విద్యార్థినికి ప్రశంస పత్రం, జ్ఞాపికతో పాటు, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ బాల సాహిత్య వేత్తలు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీతలు డా.పత్తిపాక మోహన్, డా.చొక్కాపు వెంకటరమణ, డా.కన్నెగంటి అనసూయ, డా.దాసరి వెంకటరమణ, ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్, మాచిరాజు బాలసాహిత్య పీఠం చైర్మన్ మాచిరాజు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

భీం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీడలకు చురుకుగా ఏర్పాట్లు

ఉట్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఈనెల 5 నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడల పోటీల కోసం ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ వన్, ఉట్నూర్ ఐటీడీఏ 2, భద్రాచలం ఐటీడీఏ, ఏటూరు నాగారం ఐటీడీఏ, ప్లేన్ ఏరియా ఐటీడీఏ వన్, ప్లేన్ ఏరియా ఐటీడీఏ2 ప్రాంతాలలోని 33 జిల్లాల్లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 1600మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు హాజరు అయ్యే విధంగా ఉట్నూర్ గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ వసంత్‌రావు ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ కుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 14, 17 ఏళ్ల వయసు గల విద్యార్థుల రాష్ట్ర స్థాయి పోటీలలో ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, వాలీబాల్, క్యారమ్స్, టెన్ని కాయిట్, ఆర్చరీ క్రీడాంశాలలో లీగ్ పద్ధతుల్లో పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తెలిపారు. వాలీబాల్‌కు నాలుగు మైదానాలు, కబడ్డీ పోటీలకు నాలుగు మైదానాలు, కోకో పోటీలకు నాలుగు మైదానాలు సద్ధంచేయడంతో పాటు క్యారం చెస్ పోటీలకు పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. క్రీడల ప్రారంభ కార్యక్రమానికి జిల్లాఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శితో పాటు జిల్లా అధికారులు హాజరు కానున్నారు.



ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణం



రాష్ట్రస్థాయి క్రీడలకు సిద్ధం చేసిన కొమురంభీం క్రీడా ప్రాంగణం

పవిత్ర కార్తీకం.. ఆధ్యాత్మిక సంరంభం

- ప్రారంభమైప కార్తీక మాసం
- శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం
- ఉసిరి చెట్టు నీడన సామూహిక భోజనాలు
- కార్తీక స్నానం, ఉపవాసం, కార్తీక దీపారాధన ముఖ్యమైనవి

7 లో